# ఎవరిది... ఈ నేరం?

రచన :
శ్రీ రాధేయ

రాత్రి బాగా పొద్దుపోయింది!

అలసిపోయిన సూరీడు పశ్చిమాద్రిలో గాఢనిద్రావస్థలో వున్నాడు.

పౌర్ణమి దాటి మూడురోజులైంది. అప్పుడప్పుడే వెన్నెల చక్కబెట్టుకొని ప్రసరింపజేస్తున్నాడు కలువలరేడు.

పట్నంలో కూడు గూడు లేని జీవులంతా ఫుట్‌పాత్‌ల మీద సిమెంటు పైపుల్లోనూ గాఢంగా పెనవేసుకొని అదమరచి నిద్రపోతున్నారు.

నగరం చాలావరకూ సద్దుమణిగినా, ఫాక్టరీలమాత్రం నిరంతరం పని చేస్తూనేవున్నాయ్.

పట్నంలో ఓచివర ఈశాన్యదిక్కుగాపోతే ఓ వెడల్పాటి కంకరరోడ్డు కన్పిస్తుంది. కరువునివారణపథకానికి ప్రతీకలా కన్పిస్తుంది, అదేనేరుగా దృష్టి సారిస్తే ఆరోడ్డు కిరువైపులా 50 దాకా పూరిపాక లున్నాయ్.

పట్నంలోని మురికినీరంతా రోడ్డు కిరువైపులా సమృద్ధిగా తాండవిస్తూంటుంది. దోమలు, వ్యాధులు కలిసి మెలిసి అన్యోన్యంగా జీవితం సాగించేదిక్కడే !

రోడ్డుకు కుడివైపుగా సాగిపోతే ఏడవపాకదగ్గర అనుకోకుండానే ఆగిపోతాయ్ కొన్ని కాళ్ళు !

ఎక్కువసేపు అక్కడ తచ్చారేందుకు వీలులేకుండా పాక తలుపులు ఎల్లవేళలా స్వాగతం పల్కుతూనే వుంటాయ్ !

పాకబయట పళ్ళుముదిరి, కీళ్ళుసడలిన ఆ గంగులు ముసుగుతన్ని పడుకొనివున్నా నోట్లో చుట్టమాత్రం ఎర్రగా గుప్పుగుప్పుమని పొగలు ఉంగలు తిరిగి పోతూ గాలిలో తేలిపోతూనే వుంటుంది. ఆ గుబురుమీసాలవెనుక చెదరిపోని గాంభీర్యం. ఆ బట్టతలలో అనుభవం తాలూక మేధస్సుపోయిన ఏడాదివరకూ ఆ గుడిసెవాసుల్లోకెల్లా మొనగాడిలా వెలిగిపోయినవాడు. కానీ దురదృష్టవశాత్తు తను పనిచేస్తున్న ఫ్యాక్టరీలోనే ప్రమాదం సంభవించి కుడికాలు, కుడిచెయ్యి రెండూ పోగొట్టుకున్న అవిటివాడు ఈనాడు గంగులు. కాలు, చెయ్యి లోలాడే గంగులు జీవితం ఆశలు, ఆశయాలు బుగ్గిపాలయ్యాయి.

ఆ గూడెంలో నీతి, నిజాయితీ, మానమర్యాదల సంరక్షణలో మొదటిస్థానం గంగులుదే!

కానీ, గంగులు నేడు అవిటివాడు. ఏపనీ చెయ్యలేని అభాగ్యుడు. సంవత్సరంముందే క్యాన్సర్‌తో బాధపడుతున్న తన భార్య రంగమ్మ ఖంగు ఖంగుమని దగ్గుతూంటే నోరంట రక్తం పడుతూంటే చూడలేని నిస్సహాయతలో గంగులు మోకాళ్ళు ఆని మంచందగ్గరికిజరిగి రక్తం కింద పడకుండా మట్టిపాత్రనుమాత్రం పెట్టడానికి ప్రయత్నిస్తాడు. కానీ జబ్బు తగ్గడానికి అవసరమైన మందులు మాకులు కొనడానికి శక్తిలేక విలవిల్లాడిపోతూ తన అవిటి బ్రతుకునుగురించి ఆక్రోశిస్తూ వుంటాడు.

ఒక్కగా నొక్క కూతురు లచ్చిని కష్టపడి, తన కడుపు దాచుకొని చదివించి అది ఓ ఉద్యోగం చెయ్యాలని, అలా నౌకరీచేస్తూ ఓ ఇంటిదై సంతోషంగా బ్రతుకుతూవుంటే కళ్ళారాచూసి సంబరపడిపోవాలని తన ఆశ.

కానీ, ఆశ ఇప్పుడేమైంది?

తన కాలూ చెయీ పోయేనాటికి లచ్చి పదోక్లాసు చదువుకొంటూవుంది. ఆపైన తన అవిటితనంలో, తన దరిద్రంతో లచ్చి తనచదువు మానుకొని ఆకలియాత్రకు శ్రీకారం చుట్టింది.

పట్నంలో కొంతమంది పెద్దోళ్ళ ఇళ్ళలో పాచిపనులు చేస్తూ వారు తినగా మిగిలింది పెడితే దాన్ని ఆత్రంగా ఇంటికి తీసుకొచ్చి ఆప్యాయంగా తల్లి దండ్రులకు పెట్టేది.

కొడుకువైనా, కూతురివైనా నువ్వేనమ్మా! చూడు నిన్ను ఇంగిలీసుచదువులు చదివించి ఓ పెద్ద ఆఫీసరయ్యకిచ్చి నీపెళ్ళి జరిపిస్తాలే! అంటూ ఫాక్టరీకి పనిలో కెళ్ళిపోతూ తనచేతికి అన్నంగిన్నె చేతికిచ్చే కూతురు లచ్చి తల నిమురుతు దీవించే గంగులు....ఈనాడు తన కూతురే ఇంటా బయటా పనిచేసి ఇంత చిన్నవయసులోనే కష్టపడి పనిచేసి తనచేతితో ముద్ద తినిపిస్తూవుంటే గతాన్ని తలుచుకొని గంగులు వలవలా ఏడ్చేవాడు. ఆ కన్నీళ్ళు చూడగానే ఉలిక్కిపడి —

ఏమిటినాన్నా! నీ పిచ్చి! ఇంతకాలం కష్టమంటె ఎఱక్కుండా నన్ను సాకలేదా నాన్న!

SILVER JUBILI YEAR
THERE IS JOY!
WHERE THERE IS!!
for, "SUGIJO" Single Phase Motors
IS : 996-1964 ISI : Certification Marks




JOTHI
Engineering Works
Industrial Estate
MADURAI 625 007.

ఈనాడు ముసలితనంలో మిమ్మల్ని పోషించడం నా బాధ్యతకాదా నాన్నా! అంటుంది లచ్చి!

నిజమేనమ్మా! నిజమే! నాపాలిటి తల్లివమ్మ నువ్వు: అంటూ నిక్షిప్తంగా కళ్ళు తుడుచుకునేవాడు గంగులు?

పగలనక, రాత్రనక నిద్రాహారాలుమాని కష్టపడి పని చేసిన తల్లికి రానురాను ఆరోగ్యం క్షీణించసాగింది. డాక్టరు గారిదగ్గరికి పిలుచుకొనిపోయింది లచ్చి:

చూడమ్మాయ్! ఇది చాలా ప్రమాదకరమైన జబ్బు! దీన్ని నయంచెయ్యటం సాధ్యపడదు! అంటూ డాక్టర్ సలహా ఇచ్చాడు.

అమ్మకు క్యాన్సర్. మరి నాన్నేమో అవిటివాడు.

అమ్మకు మంచిమందులు కావాలి! అమ్మను బతికించుకోవాలంటే మంచిమందులు కావాలి, తప్పదు! మందులు కొనాలంటే చేతిలో చిల్లిగవ్వ లేదు!

భగవాన్, నే నిప్పుడేంచెయ్యాలి! నాతల్లిని ఎట్లా బతికించుకోవాలి? ఎంతచాకిరి చేసినా పూట గడవటమే కష్టమైన ఈరోజుల్లో వీరినెలా దక్కించుకోవాలి! అంటూ కుమిలి, కుమిలి ఏడ్చింది లచ్చి ఒంటరిగా!

లచ్చికి వయసొచ్చింది. చోళీపరికిణి అంత తిరిగిన లచ్చి ఈనాడు చిరుగులపైటతో అందాన్ని కప్పుకోవలసివచ్చింది.

కూటికి పేదరాలైనా అందానికి ఆవాడ తన ఈడు వాళ్ళందరకీ లచ్చి ముందు తీసినట్టే!

ఆ గుడిసెవాసులందరికీ తల్లో నాలుక లచ్చి!

తను పనిచేస్తున్న ఇంటిలో యజమానికి కన్నీటితో తన పరిస్థితినంతా వివరించి ఓ వందరూపాయలు అప్పుగా ఇవ్వమని ప్రార్థించింది లచ్చి!

యజమాని లచ్చిని ఎగా దిగా చూసి సరే నన్నట్లుగా నవ్వి తన పైటవైపు మార్చిమార్చి చూస్తూ తన ఆకలి తీర్చమన్నాడు.

ఉలిక్కిపడింది. స్తబ్ధురాలైంది. నివ్వెరపోయింది లచ్చి! కానీ, అమ్మ పరిస్థితి, నాన్న స్థితి, జబ్బుపడిన అమ్మ, అవిటివాడైన నాన్న. ఇప్పుడు నేనేం చెయ్యాలి? నాకెవరు సహాయం చేస్తారు?

కనికరించి ఏదైనా ఉద్యోగమిచ్చి కాపాడే నాధుడెవరు? మందులు లేకుంటే అమ్మను బతికించుకోగలనా? ఈ పరిసితుల్లో తను చెయ్యగలిగిందొక్కటే! ఈరోజుల్లో వయ

—ATHMAS

సొచ్చిన ఆడపిల్ల సులభంగా అమ్ముకోగల్గింది. అది తప్ప తనకు వేరే గత్యంతరం లేనిది. అదేకదూ తన యజమాని కోరేది. నెరవేరిస్తే పందరూపాయలు. అమ్మకు మందులు. నాన్నకు గంజినీళ్ళు.

భగవాన్! ఈ పరిస్థితుల్లో నానిర్ణయం తప్పో ఒప్పో ఆలోచించుకొనే ఓర్పు, వ్యవధి లేదు. ఈపాపానికి తర్వాత ఏ శిక్ష అనుభవించడానికైన సిద్ధమని ఈ సాహసానికి ఒడిగట్టుకున్నాను! నన్ను మన్నించమనిమాత్రం అడగ లేను! అంటూ మౌనంగా రోధిస్తూ ఆకలిగా చూస్తున్న యజమానికి మొదటిసారిగా తన్ను తాను అర్పించుకుంది.

పందిరి లేకుండా ప్రాకే లతను ప్రతిపశువూ పాడు చేస్తుంది. పందిరివేసిన లత 'లచ్చి'కి కామపశులకు ఆలవాలమైంది.

తన జీవితంపట్ల నిర్లిప్తత, అమ్మా నాన్నల జీవితం కోసం తను చేస్తున్న ఈపని ఏంత చెడ్డదైనా సరే! అను కుంది.

ఇది తన తండ్రి గంగులుకు ఏమాత్రం తెలిసినా తన్ను నిలువునా చీల్చి నరికి పోగులు పెడతాడనే భయం. ముందు అమ్మ ఆరోగ్యం తన కళ్ళముందు భవిష్యత్తులా వుంది!

ఎవరది! మాట్లాడవేం!

గంగులు తన ఆలోచనలనుంచి తేరుకుని హెచ్చ రించాడు.

మారు పలక్కుండా ఎవరో లోపలికి వెళ్ళిపోయారు.

లచ్చితో గుసగుసలు. అర్థంకాని భాష.

గంగులుకేం పాలుపోలేదు. అంతలో ఎడతెరిపిలేకుండా భార్య ఒకటే దగ్గు. అయినా తన చెవులు నిక్కించి విన డానికి ప్రయత్నం చేస్తున్నాడు.

అంతా అర్థమైంది. భరించలేని నిజం. కళ్లెదుట నగ్న సత్యం.

తన నీతి, నిజాయితీ, మానం, మర్యాద నిట్టనిలువునా తనను దహించివేస్తున్నాయ్!

తమకోసం తనకూతురు చేసే అకృత్యాన్ని సహించని తను తనమనసు క్షతక్షతా ఉడికిపోయింది.

మానమర్యాదలు లేని బతుకు బతికేకంటే, చావే నయం!

ఛీ! నాదీ ఒక బతుకేనా? నేనూ ఒక మనిషినేనా? కన్నబిడ్డ వాళ్ళమ్మని పోషించుకోలేని ఈ దౌర్భాగ్యం నా కెందుకు?

కళ్ళు బండవిప్పు లయ్యాయి. హృదయం భగ్గుమంది. పిడికిలి బిగుసుకుంది. చుట్టూ హోరుగాలి. నోటిలో గుప్పు గుప్పున వెలిగేచుట్ట చేతిలోకి తీసుకొని తుపుక్కున క్రింద ఉమ్మేసి చుట్టనుమాత్రం పాకమీదికి విసిరేశాడు గంగులు.

అంతే, పొగ గుప్పుమంది. మంట భగ్గుమంది, పాకంతా మంటలు!

నిమిషాల్లోనే పాక నేలమట్టమై బూడిదై కాలిపోయిన జీవాలతాలూకు కమురువాసన, గూడెంలో జనమంతా ఒకటే హాహాకారాలు. ఆ మంటలు ప్రక్కన వ్యాపించ కుండా జాగ్రత్తలు. అందరూ గుర్తుపట్టగలిగి ఒళ్ళంతా కాలిపోయిన గంగులు శరీరంమాత్రం వాకిట్లోనే పడివుంది.

రక్షించేవ్యవధి ఎవరికీ లేకపోయినా....రక్షణకోసం ఎదురుచూడని ఆ మూడు దీనశవాలు సజీవ దహనాలు!

*

# పాఠకులకు మనవి

గత 46 సంవత్సరాలనుంచీ మీకు "కథాంజలి"ని అతి చౌకధరకే అందిస్తున్నాము.

ఇంతవరకూ ఎంతో కష్టనష్టాలను ఓర్చుకుని పత్రిక ధరను పెంచలేదు. ప్రస్తుత పరిస్థితిలో కొంతవరకైనా పత్రిక వెలను పెంచకపోతే పత్రికాప్రచురణే అసాధ్యమై పోతుంది గాబట్టి వచ్చే నెల సంచికనుంచి "కథాంజలి" విడిప్రతి. 75 పైసలకు పెంచక తప్పలేదు. ఇకనుంచి, సంవత్సర చందా రూ. 15-00 (రెండు ప్రత్యేక సంచికలతో సహా.) ఈ చిన్న మార్పును పాఠ కులు గమనించి, యథారీతిగా మాతో సహక రించాలని కోరుతున్నాము.

—సంపాదకుడు